క్లుప్తంగా

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి

సాక్షి అమలాపురం: జిల్లాలో ఓటర్ల జాబితా కచ్చితత్వంతో రూపొందించడంలో ప్రభుత్వ యంత్రాంగానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు కోరారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024కు సంబంధించి పురోగతిని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను, సందేహాలను నివృత్తి చేశారు. రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్, కాంగ్రెస్ పార్టీ నుంచి వడ్డీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నుంచి షేక్ అబ్దుల్ ఖాదర్, సీపీఎం నుంచి కారం వెంకటేశ్వరరావు, బీజేపీ రాజేష్ పాల్గొన్నారు.

బాధిత రైతులకు భరోసా

అమలాపురం టౌన్: తుపాన్‌తో అధిక వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అన్నారు. అమలాపురంలో అఖిలపక్షం పేరుతో టీడీపీ నాయకులు తుపాన్ బాధిత రైతులను రెచ్చగొట్టేలా ధర్నాలు చేయడం బాధాకరమన్నారు. రంగు మారిన ధాన్యం కొనుగోలుకు సీఎం జగన్ చర్యలు చేపట్టారని అన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఎకరానికి రూ.30 వేల వరకూ పంట నష్టం నమోదు అయ్యేలా చర్యలు చేపడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏ రైతుకైనా రూ.50 వేల నష్ట పరిహారం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా.. అని బులినాని ప్రశ్నించారు.

నేడు హెపటైటిస్ నియంత్రణ శిబిరం

అమలాపురం టౌన్: నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం నియంత్రణ శిబిరం జరగనుంది. ఆ ప్రోగ్రామ్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలమ సూరపనేనితో కూడిన వైద్య బృందం ఈ శిబిరాన్ని నిర్వహిస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డీఐవో) సత్యనారాయణ తెలిపారు. ఈ శిబిరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ పద్మశ్రీ రాణి అధ్యక్షతన జరుగుతుందన్నారు. హెపటైటిస్ వ్యాధిగ్రస్తులతోపాటు ఎవరైనా శిబిరానికి వచ్చి నిర్ధారణ కోసం పరీక్షలు చేయించుకోవచ్చని డీఐవో సత్యనారాయణ సూచించారు.

17న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అమలాపురం టౌన్: స్థానిక కాలేజీ రోడ్డులోని క్షత్రియ కల్యాణ మండపంలో ఈ నెల 17వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకూ షిర్డీ సాయిబాబా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని మున్సిపల్ వైస్ చైర్మన్, వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు తెలిపారు. శ్రీషిర్డీ సాయి సేవాశ్రమం వ్యవస్థాపకుడు అమ్ముల సాంబశివరావు నిర్వహణలో ఈ ఆధ్యాతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. క్షత్రియ కల్యాణ మండపంలో జరిగే ఈ ఏర్పాట్లను నానిరాజు గురువారం పర్యవేక్షించారు.

వరి చేల పరిశీలన

ముమ్మిడివరం: ఐ.పోలవరం మండలం జి.వేమవరంలో ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ముంపు బారిన పడిన వరి చేలను కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పీబీ ప్రదీప్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం ఏఓ మనోహర్ పరిశీలించారు. పనలపై ఉన్న తడిసిన ధాన్యాన్ని చూశారు. ముంపు బారిన పడిన వరి చేలలో గింజలు మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ వరప్రసాద్, రైతులు ఎలుబండి ఆంజనేయులు, సూరిశెట్టి శ్రీను, గాలిదేవర రామచంద్రరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఉప్పలగుప్తం: తుపాన్‌తో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పీసీసీ కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి ప్రభుత్వాన్ని కోరారు. భీమనపల్లి వడ్డిచెరువులో భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు.

లబ్ధిదారుల జాబితా అందజేత

యానాం: సముద్రంలో ఓఎన్జీసీ సంస్థ రెండో గ్యాస్ పైప్‌లైన్ వేస్తున్న నేపథ్యంలో యానాం నియోజకవర్గంలో మత్స్యకారులకు మంజూరు చేసిన నష్ట పరిహార లబ్ధిదారుల జాబితాను పుదుచ్చేరి కలెక్టర్‌కు అందజేసినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల జాబితాను పుదుచ్చేరి కలెక్టర్‌తో పాటు మత్స్యశాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌కు సైతం పంపినట్లు వివరించారు. జాబితా–ఏలో మొత్తం 4,750 మందిని లబ్ధిదారులుగా గుర్తించినట్లు విధంగా వారికి 22 నెలలకు గాను నెలకు రూ.11,500 చొప్పున మొత్తం రూ.115.62 కోట్లు వారి ఖాతాల్లో పడతాయన్నారు. జాబితా–బీలో మరో 892 మందిని చేర్చినట్లు తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

అమలాపురం రూరల్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి భరతలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈదరపల్లిలోని జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ వద్ద హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అమలాపురం పరిసర ప్రాంతాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు ప్రతి నెలా పౌష్టికాహార కిట్లను వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకయ్యనాయుడు అందిస్తున్నారని తెలిపారు. ఎయిడ్స్ బాధితులకు పోషకాహార కిట్లను భరతలక్ష్మి అందజేశారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు మేనేజర్ ఆదిలింగం, కారెం రవితేజ, రత్నరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి స్వర్ణయుగమిది

గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం


డి.రావులపాలెం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నాయకులు


ఉప్పంగలలో పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమానికి స్వర్ణయుగం వచ్చిందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని డి.రావులపాలెం సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని అన్నారు. ఏపీకి తిరిగి జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై సర్వే చేశారు. జేసీఎస్ మండల కనీ్వనర్ తిక్కా ప్రసాద్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి రాము, తిక్కా బాబి, బళ్ల శివ, కార్యదర్శి పి.శ్రీనివాస్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రావాలని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. ఉప్పంగల సచివాలయం వద్ద సర్పంచ్ శాఖ శంకరుడు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. దీనికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథాన నడిపిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పార్టీ జెండాను నేతలు ఆవిష్కరించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దవులూరి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కాదా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వి.వరలక్ష్మి, లచ్చిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు అనిశెట్టి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: సీఎం జగన్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. రోళ్లపాలెం సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ పేదల ఇంటికీ సంక్షేమ వసంతం తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. లబ్ధిదారుల సమాచారంతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. నాయకులు కూనవరపు సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి సత్యనారాయణ, కూనవరపు మంగాదేవి, ఉల్లింకి సత్తిబాబు, సంసాని శ్రీరామరెడ్డి, డి.లక్ష్మి, ఈవోపీఆర్డీ జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

టీడీపీ విమర్శలు హాస్యాస్పదం

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మునికుమారి


కాశి బాల మునికుమారి

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలపై హత్యాచారాలు పెరిగిపోయాయని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి అనడం హాస్యాస్పదంగా ఉందని కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, హితకారిణి సమాజం చైర్ పర్సన్ కాశి బాలమునికుమారి అన్నారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం లబ్ధి మహిళల ఖాతాలకే నేరుగా జమ చేస్తుందన్నారు. మహిళలపై వేధింపులు అరికట్టేందుకు దిశా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. తప్పుడు గణాంకాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే వారికి తగిన గుణపాఠం చెబుతామని మునికుమారి హెచ్చరించారు.

లేబర్ సెస్ వసూలు తప్పనిసరి


సమావేశంలో శ్రీనివాసరావు, డీఆర్వో సత్తిబాబు

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మాణ పనులకు సంబంధించిన మొత్తం వ్యయంలో ఒక శాతం లేబర్ సెస్‌ను కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన సొమ్ము నుంచి వసూలు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు జమ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులకు ఆమోదం తెలిపే సమయంలో తప్పనిసరిగా సెస్‌ను తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ చర్యలలో భాగంగా ఆర్థిక సహాయం, మంచి జీవన పరిస్థితులను ప్రోత్సహించడానికి ఈ నిధులు తోడ్పడతాయని కార్మిక బోర్డు నిర్ణయించిందన్నారు. డెవలపర్లు, కాంట్రాక్టర్లు, బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల పబ్లిక్, ప్రైవేట్ లేదా వ్యక్తిగత రంగాల యజమానుల నుంచి లేబర్ సెస్ వసూలు చేయాల్సి ఉందన్నారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు, ఇంజినీరింగ్ శాఖలపై సుదీర్ఘంగా సమీక్షించి 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ అప్రూవల్ వాటి వివరాలు నెలాఖరులోగా సమర్పించాలన్నారు. కార్మిక శాఖ కూడా నిత్యం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని డేటా ఎంట్రీ చేసుకోవాలన్నారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి


సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంపీపీ సునీత, ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు ప్రభుత్వం ఏటా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తుందన్నారు. సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. మరో ముఖ్య అతిథి ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ చిట్టూరి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి సూరిబాబు, ఎంఈఓ మోకా ఉమ, స్కూల్ హెచ్ఎం సీహెచ్ రాధాకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ డి.సుబ్రహ్మణ్యం, నాయకులు రెడ్డి సతీష్, వస్కారెడ్డి, కట్టా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయుల విభాగంలో నీలపల్లి ఉపాధ్యాయుడు ఎం.శేషగిరిరావు రూపొందించిన వార్మ్ సేఫ్టీ అండ్ ట్రాకింగ్‌కు ప్రథమ స్థానంలో నిలిచింది. తాళ్లరేవుకు ఉపాధ్యాయుడు జె.ఆశాలతకు ద్వితీయ, పి.మల్లవరం బి.అరుణా కిరణ్‌కు తృతీయస్థానం లభించింది. అలాగే విద్యార్థి విభాగం, గ్రూప్ ఎగ్జిబిట్ విభాగంలో విజేతలను ప్రకటించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం


పేరూరులో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న శ్రీకాంత్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని మంత్రి విశ్వరూప్ తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. పేరూరు పంచాయతీ పరిధిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రజకపేట, ఇందిరానగర్ కాలనీల్లో తాగునీటి ఇబ్బందులను శ్రీకాంత్ దృష్టికి స్థానిక మహిళలు తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో తక్షణమే తాగునీటి ఇబ్బందిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని శ్రీకాంత్ కోరారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి రుద్ర, సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీ కుమారి, ఎంపీటీసీ చొల్లంగి సుబ్బిరామ్, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో గణిత దినోత్సవం


క్విజ్ పోటీల విజేతలతో ఏపీఎంఎఫ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకాకుళంలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఫోరం (ఏపీఎంఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఇదే సందర్భంగా ఏపీఎంఎఫ్ రాష్ట్ర సమావేశాలు కూడా నిర్వహిస్తామన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మండల స్థాయి విజేతలకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను అమలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి పోటీల్లో చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. విజేతలు ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే ఏపీఎంఎఫ్ సమావేశాల్లో రాష్ట్ర క్విజ్ పోటీలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి విజేతలను ఏపీఎంఎఫ్ ఉపాధ్యక్షుడు పీవీఎల్ఎన్ శ్రీరామ్, ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలభద్ర సురేష్, కార్యదర్శి మోర్త నాగ సూర్యనారాయణ అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్‌చార్జుల నియామకం

అల్లవరం: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణను అందించేందుకు మండలంలోని 76 అంగన్‌వాడీ కేంద్రాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇన్‌చార్జులను నియమించామని ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గ్రేడ్–5 కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్, మహిళా పోలీసు, ఏఎన్ఎంలకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచే ఉంటాయని లబ్ధిదారులు టేక్ హోమ్ రేషన్‌ను పొందవచ్చని సూచించారు. దేవగుప్తం, కొమరగిరిపట్నం, అల్లవరం గ్రామాల్లో ఇన్‌చార్జులుగా బాధ్యత తీసుకున్న సిబ్బంది టేక్ హోమ్ రేషన్‌ను లబ్ధిదారులకు అందించారు. మిగిలిన గ్రామాల్లో శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎంపీడీఓ తెలిపారు. పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శి రాజమోహన్, సూపర్‌వైజర్లు ఉన్నీషా, కుమారి, భారతి పాల్గొన్నారు.

నవోదయలో నాణ్యమైన విద్య


విద్యార్థినికి నీట్, జేఈఈ పుస్తకాలు అందిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: జవహర్ నవోదయ విద్యాలయాల ద్వారా పేదలకు నాణ్యమైన విద్య అందుతుందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.మునిస్వామి అన్నారు. గురువారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల (వీఎంసీ) సమావేశం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం విజ్ఞాన్‌జ్యోతి కార్యక్రమంలో భాగంగా యానాం, తాళ్లరేవు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 100 మంది 10, 12 తరగతి విద్యార్థినులకు ఆయన ఒక్కొక్కటి రూ.8 వేల విలువ చేసే నీట్, జేఈఈ స్టడీ మెటీరియల్, ఎస్‌టీఈఎమ్ కిట్స్‌ను ఉచితంగా అందజేశారు. కోర్డినేటర్ జయప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం అందజేస్తున్న కిట్లతో పాటు అదనంగా వారాంతంలో వర్చువల్ మాధ్యమంలో తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, జీజీహెచ్ డీడీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలసిన గీత


ఎంపీలు మిథున్‌రెడ్డి, సురేష్‌లను మర్యాద పూర్వకంగా కలసిన గీత

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులైన అమలాపురానికి చెందిన దేవరపల్లి గీత ఎంపీ, ఉభయ గోదావరి జిల్లాల పార్టీ సమన్వయకర్త మిథున్‌రెడ్డిని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనను రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియమించడం పట్ల సీఎం జగన్, ఎంపీ మిథున్‌రెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మిథున్‌రెడ్డితో పాటు బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌లు గీతను అభినందించారు. అలాగే రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని కూడా గీత మర్యాద పూర్వకంగా కలిశారు. గీత భర్త వీఎస్ దివాకర్ రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ కావడంతో ఆమెకు పదవి రావడం పట్ల పలు ఉద్యోగ సంఘాల నేతలు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ


సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: పితృ వియోగంతో బాధపడుతున్న అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి సుంకర సుధను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు గురువారం పరామర్శించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని సుధ ఇంటికి ఎమ్మెల్సీ వెళ్లి సానుభూతి తెలిపారు. సుధ తల్లి, మున్సిపల్ కౌన్సిలర్ పార్వతిని పరామర్శించారు. దివంగత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు కుడుపూడి త్రినాథ్ పరామర్శించారు.

సీఎం జగన్ ఉద్యోగుల పక్షపాతి


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఆశా వర్కర్లు

అమలాపురం టౌన్: సీఎం జగన్ ఉద్యోగుల పక్షపాతి అని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయాలే ఉంటాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్ల నిరసన శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి వారితో మాట్లాడారు. రాష్ట్రంలో రెండేళ్ల కరోనా విలయ తాండవం చేసినా ఆశా వర్కర్ల జీతాలు ఎప్పుడూ ఆపలేదని గుర్తు చేశారు. ఆ విపత్కర సమయంలో వర్కర్ల సేవలు అమూల్యమైనవన్నారు. వీరి కోర్కెలను సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళతానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

తుపాను నష్టంపై పరిశీలన


కాట్రేనికోనలో దెబ్బతిన్న పంట పొలాల వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కాట్రేనికోన: తుపాను నష్టంపై అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందం గురువారం మండలంలో పర్యటించిందని జేసీ నుపూర్ అజయ్ అన్నారు. అనాతవరంలో వరి పంటను, గెద్దనాపల్లిలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. కొప్పిగుంటలో పాడైన కొబ్బరి తోటను, కందికుప్ప శివారు పొన్నాడ వారి గట్టు ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ సంచాలకులు మహేంద్ర చందేలియా, కేంద్ర మంత్రిత్వ శాఖ గ్రామీణ అభివృద్ధి సహాయ కమిషనర్ చాచాత్ సింగ్, ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు ఉన్నారు.

వలకట్ల హద్దుల కోసం బోట్ల పోటీ


చేపల వేట హద్దు కోసం బోట్ల పోటీలో పాల్గొన్న బలుసుతిప్ప మత్స్య కార్మికులు

కాట్రేనికోన: బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప గ్రామంలో వల కట్ల హద్దుల కోసం గురువారం మత్స్య కార్మికులు మధ్య బోట్ల పోటీ జరిగింది. బలుసుతిప్ప సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు ఈ పోటీని ప్రారంభించారు. చేపల వేటపై జీవనం సాగిస్తున్న బలుసుతిప్ప మత్స్య కార్మికులు గోదావరి పాయలో వలకట్ల కోసం కుటుంబంతో సహా వలస వెళ్తుంటారు. వలస వెళ్లిన మత్స్య కార్మికులు గోదావరికి వరదలు రావడంతో ఇళ్లకు చేరతారు. తిరిగి చేపల వేటకు వెళ్లేందుకు ప్రతి ఏటా దీపావళికి అనంతరం వలకట్ల హద్దుల కోసం బోట్ల పోటీలో పాల్గొంటారు. ఈ పోటీలో విజేతలు వలకట్లు హద్దులో గోదావరి వరదలు వచ్చేవరకూ చేపల వేట చేయవచ్చు. బలుసుతిప్ప నుంచి గోదావరి పాయలో మగసానితిప్ప, దరియాలతిప్ప, యానం, కోటిపల్లి వరకూ వలకట్లలో చేపల వేట చేస్తారు. బలుసుతిప్ప గ్రామ పెద్దలు, నాయకులు మల్లాడి ఆదినారాయణ, తిరుమాని సత్తిబాబు, ఓలేటి సతీష్, ఇసుకపట్ల శ్రీనుబాబు, కామాడి గంగాద్రి, బర్రే రాంబాబు, సంగాని సముద్రుడు తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

యానాం: నియోజకవర్గ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద పుదుచ్చేరి మురికివాడల అభివృద్ధి బోర్డు ద్వారా ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకంలో 31 మందికి మూడు విడతల సహాయాన్ని ఆయన అందజేశారు.

పింఛను సొమ్ము పెంపు

యానాం: వికలాంగులకిచ్చే పింఛను సొమ్మును వచ్చే నెల జనవరి నుంచి రూ.వెయ్యి పెంపునకు నిర్ణయించినట్లు పుదుచ్చేరి సీఎం రంగసామి వెల్లడించారు.

యూడీసీలుగా పదోన్నతి

యానాం: స్థానికంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎల్‌డీసీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి యూడీసీలుగా పదోన్నతులు కల్పిస్తూ గురువారం ప్రభుత్వ కార్యదర్శి జయశంకర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు పెసింగి రాంబాబు, కట్టుంగి చంద్రశేఖర్, డి.మురళీకృష్ణ, తిరుకోటి అర్జునరావు, కమిడి రమేష్, కమిడి రాజేశ్వరీలకు పదోన్నతి లభించింది.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

యానాం: యానాం, దరియాలతిప్ప తదితర ప్రాంతాలకు చెందిన రైతులకు ఉపకరించే విధంగా కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యుత్తు శాఖ ఏఈ లంక కృష్ణారావుకు గురువారం యానాం ఆక్వా అండ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అడివిపాలెం వద్ద రీజెన్సీ ఇంజినీరింగ్ కళాశాల పక్కనే రైతుల కోసం పది స్తంభాలు వేశారని, చెరువులకు 3 కిలోమీటర్ల దూరంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో కరెంట్ తక్కువలోడు రావడంతో ఏరియేటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. సమస్యను పరిష్కరించాలన్నారు.

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ

అమలాపురం రూరల్: బండారులంక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం బాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ సరెళ్ల దుర్గాదేవి మాట్లాడారు. దివ్యాంగుల అభ్యసనా సమర్థ్యాలు మెరుగుపరచాలని, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి ప్రభుత్వం ఉచిత చికిత్స అందిస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను దివ్యాంగులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీమాత శ్రీనివాసరావు, నానాజీ, సుబ్బలక్ష్మి, అన్నపూర్ణ, బొంతు వరలక్ష్మి, రెహమాన్, ఎస్.త్రినాథ్, అనూష, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

తపాలా సిబ్బంది సమ్మె


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

యానాం: గ్రామీణ తపాలా ఉద్యోగుల కేంద్ర, రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు కాకినాడ డివిజన్ పరిధిలోని యానాం, తాళ్లరేవు పోస్టాఫీసుల్లో పనిచేస్తున్న సిబ్బంది స్థానికంగా చేస్తున్న నిరవధిక సమ్మె గురువారంతో మూడో రోజుకు చేరుకుంది. డివిజన్ సహాయ కార్యదర్శి ముమ్మిడివరపు బుల్లియ్య మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల (గ్రామీణ డాక్‌సేవక్)కు సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, 8 గంటల పని పెట్టి మెడికల్ ఖర్చులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. నాయకులు నాగేశ్వరరావు, సుబ్బారావు, శశి, దివ్యకుమార్, దుర్గాలక్ష్మి, భానుతేజ, భవాని శంకర్, అభి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.